క్లుప్తంగా

ఘనంగా గ్రామోత్సవం


ఊరేగుతున్న ఏకవీరమ్మ

ఓబులవారిపల్లె : ఉగాది పండుగ సందర్భంగా జిల్లేలమడక గ్రామంలోని గ్రామదేవత ఏకవీరమ్మ గ్రామోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ప్రజలు ఘనంగా జరిపారు. ఉదయం నుంచి ఆలయం వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించి సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని ఛాందినీ బండిపై ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం చేశారు. రెండు రోజులపాటు మండల కేంద్రంలోని అన్ని గ్రామాలలో గ్రామ దేవత ఊరేగింపు నిర్వహించి అనంతరం ఆలయానికి చేర్చనున్నారు. నేడు గురువారం జిల్లేల మడక వడ్డిపల్లి గ్రామంలోని ఆలయంలో తిరునాల నిర్వహించనున్నారు. అమ్మవారిని గ్రామస్తులు దర్శించుకొని పూజలు నిర్వహించనున్నారు.

ఘనంగా ఆడపూరు మంచాలమ్మ తిరునాల


మంచాలమ్మ సన్నిధిలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

నందలూరు(రాజంపేట) : ఆడపూరులో మంచాలమ్మ తిరునాలు బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారికి పొంగుబాళ్లు పెట్టుకున్నారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు. తిరునాల సందర్భంగా మంచాలమ్మను జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, మండల పార్టీ కన్వీనరు గోపిరెడ్డి, తాండ్ర రమేష్‌నాయుడు, ఆలయ ధర్మకర్త రామచంద్రనాయుడు వైఎస్సార్‌సీపీ నాయకులు గొబ్బిళ్ల త్రినాథ్, అరిగెల సౌమిత్రి, గీతాల నరసింహారెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, జయచంద్రారెడ్డి, శంకరశెట్టి, ఆటో శంకర్, బీసీ నాయకులు భాస్కర్ యాదవ్, ఆనాల మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు


నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయం

పుల్లంపేట : మండల పరిధిలోని బోటుమీదపల్లి గ్రామంలో రూ. 2 కోట్లతో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ పరబ్రహ్మ దేవాలయం నిర్మించారు. నేటి నుంచి ఈనెల 27వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయంలో ఐదురోజులపాటు అన్నదానం, చెక్కభజన, గోపూజ, కోలాటం, పండర భజన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నీరే ప్రాణాధారం


మాట్లాడుతున్న జడ్జి సంధ్యారాణి

రాజంపేట : మానవ సమాజంలో నీరే ప్రాణాధారమని రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. బుధవారం డీబీఎస్‌పల్లెలో వాటర్ డే సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీరు లేకపోతే జీవం లేదన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. నీరు వృథా చేయరాదన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా చెట్లు పెంచాలన్నారు. అడవుల విస్తీర్ణం పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి సల్పాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం అవసరమని తెలిపారు. నీరే లేకపోతే మానవ మనుగడే లేదన్నారు. న్యాయవాది శ్రీనివాసులు, కార్యదర్శి విశ్వనాథ్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రంను ప్రారంభిస్తున్న దృశ్యం

రాజంపేట రూరల్ : వేసవిని దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్‌సీపీ నియోజవర్గ మహిళా కార్యదర్శి మిరియాల సురేఖ ఉచిత చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని మన్నూరులో బుధవారం ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రంను వైఎస్సార్‌సీపీ నాయకుడు డీలర్ సుబ్బరామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఉచిత చలివేంద్రం ఏర్పాటు చేయటం శుభపరిణామని రాష్ట్ర ఆర్టీసీ డైరెక్టర్ జి.గుల్జార్‌బాషా, కె.శేఖర్‌రెడ్డి, ఓ.సునీల్‌కుమార్, అమరనాథరెడ్డి, ఎస్.మసూద్‌అలిఖాన్, ఎం.శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా ఉగాది ఉత్సవాలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పలుచోట్ల పంచాంగ శ్రవణాలు నిర్వహించిన ఆలయ కమిటీలు


రాజంపేట టౌన్: అలంకరణలో వినాయకుడు


రాయచోటి టౌన్: పంచాంగ పఠనం చేస్తున్న వేదపండితులు కైపా సురేంద్రబాబు శర్మ


పుల్లంపేట: గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


చిన్నమండెం: మల్లూరమ్మ ఆలయంలో..

రాయచోటి టౌన్ : తెలుగు సంవత్సరం శ్రీ శోభకృత్ నామ సంవత్సర వేడుకలు గ్రామాలలో వేడుకగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి గ్రామాలలో తెల్లవారుజాము నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. అలాగే తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి కొబ్బరి కాయలు కొట్టి తమ పూర్వీకులను మననం చేసుకున్నారు. అలాగే షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి తయారు చేసి బంధువులకు పంచిపెట్టారు.

ఆలయాలలో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం

ఆలయాలలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. రామాలయాలలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం వేదపండితులు కైపా సురేంద్ర బాబు శర్మ ఆధ్వర్యంలో పంచాంగ పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి అధ్యక్షులు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి, మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున, సభ్యులు నాగభూషణం, రత్నశేఖర్ రెడ్డి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉగాది పర్వదిన వేడుకలు

చిన్నమండెం : మండలవ్యాప్తంగా ప్రజలు ఉగాది పర్వదిన వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్నానాలు ఆచరించి సమీప ప్రాంతాలలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలుచోట్ల ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉగాది పచ్చడిని తయారుచేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించి అనంతరం బంధుమిత్రులకు పంచిపెట్టారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుక మండలంలోని గ్రామగ్రామాన వైభవంగా నిర్వహించారు. మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. యువత సాంప్రదాయ దుస్తులలో కనిపించారు. ఉగాది శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ద్విచక్ర వాహనదారులు అనంతపురం గంగమ్మ ఆలయంలో వాహనాలకు పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామాలల్లో యువత క్రీడా పోటీలల్లో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. మహిళలు రంగవల్లులతో ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇంటి ముంగిట స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.

గ్రామ దేవత ఊరేగింపు

పుల్లంపేట : ఉగాది సందర్భంగా బుధవారం మండల పరిధిలోని కోనెయ్యగారిపల్లి గ్రామంలో గ్రామ దేవతను పురవీధుల గుండా ఊరేగించారు. ఉదయాన్నే ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం వేళ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రతి ఉగాది నాడు గ్రామ దేవతను ఊరేగించడం ద్వారా పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్తుల విశ్వాసం.

రాజంపేటలో..

రాజంపేట టౌన్ : నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలు బుధవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాల్లో విశేషంగా పూజా కార్యక్రమాలు చేశారు. తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. అలాగే ఆలయాల్లో కొలువుదీరిన ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో, వివిధ రకాల ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. రాజంపేట పట్టణంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకులు జనార్దన స్వామి నేతృత్వంలో పంచాంగాన్ని చదివి వినిపించారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు రూరల్ : మండలవ్యాప్తంగా ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా పలు దేవాలయాల్లో పంచాంగం పఠించారు. రైల్వేకోడూరు మండలంలోని రెడ్డివారిపల్లె వద్ద ఉన్న లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పంద్రా నరసింహులు ఆధ్వర్యంలో సీనియర్ అర్చకులు నారాయణాచార్యులు స్వామి వారికి విశేష పుష్పాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు గ్రామదేవతకు బోనాలు పెట్టి సల్ల కార్యక్రమం నిర్వహించారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన మంగళగౌరి సమేత అమరలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆలయ అరచ్చకులు సాంబయ్య తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా బుధవారం మంగళగౌరి అమ్మవారిని ప్రతిష్ట అనంతరం 41రోజు అభిషేక కార్యక్రమంలో భాగంగా బుధవారం 34వ రోజు ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకొని స్వామి వారికి, అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.


లక్కిరెడ్డిపల్లె: అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి


సంబేపల్లె: నల్లగంగమ్మ ఆలయంలో

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల వెంకట శివసాయి, దేవరరాయి నల్లగంగమ్మ, దుద్యాల కొత్త పురమ్మ, గుట్టపల్లె వీరాంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పండుగ పురస్కరించుకొని ఆలయాలను మామిడి తోరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌లకు భక్తులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.


రైల్వేకోడూరు రూరల్: అలంకరణలో అమ్మవారు


సిద్దవటం: పూజలందుకున్న అమరలింగేశ్వరుడు


సిద్దవటం: అమరలింగేశ్వరాలయంలో భక్తులు

చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, నిర్వాహకులు

వీరబల్లి : మండల పరిధిలోని సోమవరం గ్రామం పుత్తావాండ్లపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కుళ్లాయి రెడ్డి కుమారుడు శ్రీనివాసులరెడ్డి, కుటుంబ సభ్యులు బుధవారం ఉగాది పురస్కరించుకొని పేదలకు 1500 చీరలు పంపిణీ చేశారు. తమ గ్రామ పరిధిలోని పేదలకు ఏడాదికి ఒకసారి తమవంతు ఎంతో కొంత సహాయం చేస్తుంటామన్నారు. ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి చేతులు మీదుగా చీరలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నిరుపేదలకు రంజాన్ కానుక పంపిణీ


రంజాన్ కానుకను అందజేస్తున్న దృశ్యం

గాలివీడు : మహమ్మదీయ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నిరుపేదలకు, వితంతువులకు, దివ్యాంగులకు దాదాపు 80 కుటుంబాలకు రంజాన్ కానుక పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదభూషన్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లి సీఐ వర ప్రసాద్, గాలివీడు మండల ఎస్ఐ బీవీ కుమార్‌లు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో పేదవారికి నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో రైస్‌మిల్ తంగాళ వేణుగోపాల్, కూరగాయల సుబ్బారెడ్డి, మహమ్మదీయ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ట్రస్టు, మస్జిదే తౌహీద్ గాలివీడు ప్రెసిడెంటు తాజుద్దీన్, వైస్ ప్రెసిడెంటు గౌస్ మొహిద్దీన్, సభ్యులు అహ్మద్, షర్షిల్ అహ్మద్, షబ్బీర్, అమీర్ బాషా, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు


బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె అర్బన్ ప్రాంతంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టామని నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. బుధవారం నారాయణ రాజుపేట జగనన్న కాలనీలో రూ.10లక్షలతో కొత్త బోర్లు వేయనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డిల చొరవతో నవరత్నాలలో భాగంగా పేదలందరికి ఇళ్లు పథకంలో రూ.10లక్షల మంజూరు చేశారన్నారు. విద్యుత్‌లైన్ల పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకేపాటి రమేష్‌రెడ్డి, మట్టిబాబు, శిరసాల నాగేంద్ర, తుమ్మల శివ, పొంబల శివ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

చదువుకున్నవారికే సమాజంలో అధిక విలువ


నృత్యం చేస్తున్న విద్యార్థులు

పెనగలూరు : చదువుకున్నవారికే సమాజంలో విలువ అధికంగా ఉంటుందని సాయి వికాష్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, నిర్వాహకుడు తిరుమల రెడ్డయ్య అన్నారు. బుధవారం చక్రంపేట సాయి వికాష్ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ పేర్వెల్ పార్టీలో మొదటగా జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహిస్తే వారికి విలువ ఉంటుందన్నారు. పరీక్షలలో టెన్షన్ పడకుండా రాసేందుకు అలవాటు పడాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి.

ప్రొటోకాల్ పాటించకపోవడం అవమానకరం


గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 6వ వార్షికోత్సవం కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మినుగు సుధాకర్‌ను ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించకుండా అవమానించారని సీనియర్ నాయకుడు గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సర్పంచ్ దళితుడు అనే కారణంగా పాఠశాల వార్షికోత్సవంలో స్టేజీ పైకి ఏపీఎండీసీ పాఠశాల నిర్వాహకుడు పిలవకుండా అవమానించారని ఆయన విమర్శించారు. వైఎస్సార్ పార్టీ తరఫున సర్పంచ్‌గా పోటీ చేసి స్థానిక దళితుడైన సర్పంచ్ మినుగు సుధాకర్ గెలుపొందారని అన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచ్, ఎంపీటీసీలకు కనీస మర్యాద ఇవ్వకుండా అవమానించిన ఏపీఎండీసీ పాఠశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని అన్నారు.

జీవకోటికి జలమే ఆధారం


వాటర్ డే పోస్టర్ ఆవిష్కరణ

కురబలకోట: జీవరాశుల మనుగడకు గాలి తర్వాత జలం అత్యవసరమని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాధన్ అన్నారు. బుధవారం వరల్డ్ వాటర్‌డేని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవరాశులు బతకడానికి నీరు ముఖ్యమన్నారు. ఇది లేని చోట మనుగడ కష్టమన్నారు. నీరు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. ఆహారం లేకపోయినా కొద్ది రోజులు బతకవచ్చన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో తైక్వాండో శిక్షకుడు జంషీర్ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు తైక్వాండోలో బ్లాక్ బెల్ట్‌కు అర్హత సాధించారు. ఎస్.సద్రిఅలం, అభిషేక్, ఉమర్‌అబ్దుల్లా, హలీమ సాదియ, అలకనంద, హృదయకుమార్ బ్లాక్‌బెల్ట్ సర్టిఫికెట్‌లు సాధించడంపై కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు క్రీడాకారులను అభినందించారు. రాబోయే రోజుల్లో మరింత రాణించి, మరిన్ని పతకాలను సాధించాలని జంషీర్ ఆకాంక్షించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ; ఇద్దరికి గాయాలు

కలికిరి : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన బుధవారం సాయంత్రం కలికిరి పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మేడికుర్తి గ్రామం సన్యాసివారిపల్లికి చెందిన ఎస్.ఎహసాన్ తన ద్విచక్రవాహనంలో కలికిరి వైపు నుంచి కొత్తగజ్జలవారిపల్లి సమీపంలోని పెట్రోల్ బంకు వద్దకు వెళుతున్నాడు. మార్గంమధ్యలో పాళెంకురవపల్లి బస్టాప్ సమీపంలో కలికిరి వైపు నుంచే పల్లవోలు గ్రామం ద్వారకనగర్‌కు ద్విచక్రవాహనంలో వెళుతున్న టి.వెంకటేశ్వరను వెనుకవైపు నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో ఎస్.ఎహసాన్ తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. వెంకటేశ్వరకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంకు సమాచారమిచ్చి కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు


అమ్మవారికి దీలు,బోనాలు సమర్పిస్తున్న మహిళలు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో జ్యోతి ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఉత్సవాలు పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలకరించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నీరుగట్టువారిపల్లె, కదిరిరోడ్డు,బైపాస్ రోడ్డు, గొల్లపల్లి ప్రాంతాలకు రద్దీ ఏర్పడింది. భక్తుల కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. అమ్మవారిని అర్చకులు సేతుస్వామి ప్రత్యంగిరి అలంకరణలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అమ్మవారిని దీలు, బోనాలు సమర్పించారు. ఆలయం ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. తొగటవీరక్షత్రియులు జ్యోతులను తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేక వాహనంలో పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

జమాతే హింద్ ఉగాది శుభాకాంక్షలు

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలో జమాతే-ఇస్లామీ-హింద్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణ ప్రముఖులకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్డులు పంచిపెట్టారు. బుధవారం ఆ సంస్థ జిల్లా శాఖ అధ్యక్షుడు అజమ్‌ఆలీఖాన్ సభ్యులతో కలసి శోభకృత్‌నామ సంవత్సర ఉగాధి శుభకాంక్షల గ్రీటింగ్ కార్డులను పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆ సంస్థ నాయకులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకలో పాల్గొన్న ప్రభుత్వ విప్



పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు లోగిళ్ళలో శోభకృత్ నామ సంవత్సర కొత్త వెలుగులు నింపాలని ప్రార్థిస్తున్నామన్నారు. నూతన యేడులో రైతులకు, శ్రామికులకు, ప్రతి ఒక్కరికీ అధికమైన మేలు జరగాలని కోరారు. శోభకృత్ నామ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు భారతదేశం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, సుధాకర్‌రాజు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్, జిల్లా కోఆప్షన్ సభ్యులు వైఎస్ అన్వర్ బాషా, ఆర్‌సి.సురేష్‌బాబు, సీహెచ్.రమేష్, మండల నాగేంద్ర, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల

రాజంపేట రూరల్ : రాజంపేట ప్రాజెక్టులో ఉన్నటువంటి అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల మంగళవారం తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి తెలియజేశారు. రాజంపేట ప్రాజెక్టు పరిధిలోని రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాలలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు(03), సహాయకురాలు పోస్టులు(06), మినీ అంగన్ వాడీ కార్యకర్తల(03) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నామని చెప్పారు. రాజంపేట మండలంలోని నారంరాజుపల్లి(బీసీ-ఏ-79), వెంకటరాజంపేట(ఓసీ-80) నందలూరు మండలంలోని నీలిపల్లి(బీసీ-డీ-68)లో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, రాజంపేట మండలంలోని చింతలకోన(బీసీ-ఏ-29), అంబేడ్కర్‌కాలనీ(ఎస్టీ-33), నందలూరు మండలంలోని భగత్ సింగ్‌నగర్‌కాలనీ(ఓసీ-31)లలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, రాజంపేట మండలంలోని మందపల్లి-2(ఓసీ-65), పెనగలూరు మండలంలోని ఇండ్లూరు-1(బీసీ-ఈ-19), ఓబిలి హెచ్‌డబ్ల్యూ(ఓహెచ్-06), ఓదేటివారిపల్లి(బీసీ-బీ-60), కట్టావారిపల్లి(ఈడబ్ల్యూఎస్-61), నందలూరు మండలంలోని కుంపుణీపురం(ఎస్సీ-72)లలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలియజేశారు. జూలై 1వ తేదీ 2023 నాటికి 21 సంవత్సరాలు దాటి 35 సంవత్సరాలలోపు వయస్సు గల వారై ఉండాలన్నారు. దరఖాస్తు దారులు స్థానికతకు అధార్‌కార్డు, రేషన్ కార్డు, ఓటర్‌కార్డుతో పాటు సంబంధిత తహసీల్దార్ జారీ చేసిన నివాస స్థల ధృవీకరణ పత్రం జతపరచాలి. అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు, మినీ అంగనవాడీ కార్యకర్త పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలియజేశారు. మార్చి 27వ తేది సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను రాజంపేట ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేసి రశీదు పొందాలని కోరారు.

ఘనంగా బోయకొండ గంగమ్మ తిరునాల


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : మండలంలోని ముడుపులవేముల పంచాయతీ రాయలవారిపల్లె సమీపంలో వెలసిన శ్రీ బోయకొండ గంగమ్మ తిరునాల బుధవారం ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించారు. రాత్రికి చెక్కభజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం అమ్మవారి ఊరేగింపు, పొంగళ్లు, దీలు, బోణాలు ఉంటాయని నిర్వాహకులు అన్నపూర్ణ క్యాటరింగ్ అధినేత ఆర్.కె. చలపతి తెలిపారు. భక్తులకు రెండు రోజులపాటు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. అర్చకులు కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. సర్పంచ్ రాజేష్, ఎంపీటీసీ చెంగల్‌రాయుడు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్ : దేశభక్తి, జాతీయభావం, తెలుగుదనం ప్రతిబింబించేలా చక్కని చిత్రాలతో ఉట్టిపడేలా హిందూ ఉపాధ్యాయ సమితి క్యాలెండర్ ఉందని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శోభకృత్ నామ తెలుగు సంవత్సర ఉగాది సందర్భంగా బుధవారం కడప హిందూ ఉపాధ్యాయ సమితి రూపొందించిన క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమ్మెట శశిధర్, ఎంఈఓ పాలెం నారాయణ, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.